# గాలి దోషం



'గాలిలో ఎగురుతున్నట్టు ఎప్పుడేనా కలగన్నావా ?' ప్రొఫెసర్ మిడతంభొట్లు భార్యని అడిగారు.

'ఊహు' అని పరాగ్గా రాధ సమాధానం. కారం పెట్టి కూర వండడానికి గుత్తి వంకాయలు తరుగుతున్న రాధకి భర్త వేసిన చొప్పదంటు ప్రశ్నకి అంత కన్న విపులంగా సమాధానం చెప్పవలసిన అవసరం కనిపించలేదు.

'అదికాదు రాధా ! ప్రతివాడు గాలిలో ఎగరాలని కలలు కంటాడు. విమానంలో కూర్చుని ఎగరడం మాటకాదు నేను చెప్పేది. నిజంగా 'లఘుయానం.' అనగా అమాంతం గాలిలోకి తేలిపోగలగడం గురించి నేను చెబుతూంట, లియొనార్డో—డ—వించి రోజులనుండి యిటువంటి కోరికలు మానవుడి మస్తిష్కంలో మెరుస్తూనే వచ్చాయి' అని మిడతంభొట్లు విశదీకరించేరు.

మిడతంభొట్లుగారి అసలుపేరు ఎవరికీ తెలియదు. 'వెంబుగారు', 'గొట్టంగారు'లా ఆంధ్రదేశంలో చెలామణి అవుతూవున్న గౌరవ నామాలలో యిదొకటి.

'ఇంటికొచ్చి కూడ ఏమిటీ గొడవ, పత్రిక, చదువుకొందురూ !' తరిగిన వంకాయలు నీళ్ళలో పడేస్తూ విసుక్కుంది రాధ.

అంత సులభంగా వదలి పెట్టే వాడయితే మిడతంభొట్లు ప్రొఫెసర్ అయేవాడా ? ఆంధ్రదేశంలో ఎక్కడో 'శీఘ్రయానం రాదయేవాడు'. ఇంట గెలిచి రచ్చగెలవమన్నారు కూడాను.

'గాలిలో తేలిపోవడమంటే ఏమిటను కున్నావు ? రెక్కలు లేకుండా, యంత్ర సహాయం లేకుండా, ఇంద్రజాలం చెయ్యకుండా ఎప్పుడైనా గాలిలో తేలిపోయావా? అలా...నల్లగాలిలో ... మెల్ల ... మెల్లగా తేలిపోవాలన్న కోరికైనా పుట్టలేదా నీకు?' ఆతృత, అమాయకత్వం తొణికాయి మిడతంభొట్లు మొహంలో.

'లేకేమి ! పెళ్ళికాక మునుపు, సముద్రపుటొడ్డుకి షికారుకెళ్ళి, భవిష్యత్తుని తల్చుకుంటూ, అలా...అలా... వూహాలోకంలో తేలిపోతూ చీకూ చింతా లేకుండా ప్రయాణం చేస్తూ వుంటే, గుదిబండలా మిమ్మల్ని నా మెడకేసి కట్టేసి నా ప్రయాణాలని భూస్థాపితం చేశేశారు పెద్దవాళ్ళంతా' అని వెటకారంగా అంటూ రాధ కత్తిపీట దగ్గరనుండి లేచింది.

చదువుకుందామని తెచ్చుకున్న పత్రికని కాస్త నేలకేసి కొట్టేరు మేష్టారు. పరిస్థితిని గమనించి రాధ సముదాయించడం మొదలు పెట్టింది.

'అది కాదండీ ! ఎగురుతూ వున్నట్టు నేనూ కలగన్నాను. కల కల్లే అవుతుంది గాని నిజం ఎలాగవుతుంది. ఒకసారి మంతావారి మేడమీద నున్న బట్టలారేసు కావే దండెంమీద వెళ్ళి వాలినట్లు కల వచ్చింది. నేను సిగ్గుతో చచ్చిపోయాను గాని ఎవరూ గమనించినట్టే కనిపించలేదు. అదేమిటో శరీరం అంతా దూది పింజలా తేలిపోతూన్నట్టు అనిపించింది.'

'భూకాశాలా చూశావా!! ఇలాటి కల రావడానికి కారణం ఏమిటా అని ఎప్పుడేనా ఆలోచించేవా?' దొరికిన సదవకాశాన్ని దుర్వినియోగం చెయ్యదలుచుకోలేదు మిడతంభొట్లు. 'రాధా! అసలు కల అనేది మన మెదడులోని నాడీమండలానికి ఏదో అవ్యక్తమయిన ప్రేరేపణ జరిగితే అది కల రూపంలో సంభవిస్తుందిట. ఈ ప్రేరేపణ లిప్త మాత్రంలో సుషుప్తావస్తలో వున్న మన మనోవీధిలో సందర్భోచితమయిన దృశ్యాన్ని ఒకదానివి సృష్టిస్తుందిట. అదే కల'. ఊపిరి పీల్చుకుందుకు ఆగేరు ఫిజిక్సు మేష్టారు.

తన ఎడమ చెయ్యి నుదుటిమీద వుంచి 'మీ వరస నాకేమీ అర్థం కాడం లేదు. మీ మేష్టర్లంతా కలిసి, ఎంత వద్దంటున్నా వినకుండా, ఆ చింతచెట్టు కింద చదరంగం ఆడతారాయిను. ఒళ్ళు వెచ్చగా లేదే! గాలి దోషమో ఏవిటో! అవధానిగారిని పిలిపిస్తాను' పీట, కంచాలు పెడుతూ వున్న రాధ నిజంగా ఆత్రపడసాగింది.

'గోమూత్రం, నిమ్మకాయ రసం, రుద్ర జడాకు పసరు కలిపి, తేనెతో రంగరించి అరగంటకో చెంచాడు పుచ్చుకోమన్నావు కాదు. ఇంకా నయం! మా నాన్నగారు దగ్గరుంటే 'లైకసిన్ 200' గంటకి మూడు మాత్రల చొప్పున వేసేసి తన హోమియోపతీ వైద్యం తడాఖా చూపించేద్దురు. రాధా! ఒకసారి ఏమిటి జరిగిందో చెపితే నువ్వు నమ్మవు!'

'నమ్మకపోయినా నమ్మకపోవచ్చు.'

'మెడ్రాసులో భౌతిక శాస్త్ర పండితుల సదస్సు అయితే వెళ్ళేను. వెల్కం హొటేలులో...'

'నాతో పొలం పనిమీద గొల్లపాలెం వెళతానని మీరు నాకు తెలియకుండా మెడ్రాసు వెళ్ళేరా? బుద్ధి పోగొట్టుకున్నారు కాదు. గాలిదోషం పట్టిందంటే పట్టు...'

'ఆగు రాధా ఆగు! చెప్పేది కడ తీరా విను. ఎక్కడున్నాను? వెల్కం హొటేలు. అకస్మాత్తుగా హొటేలుకి నిప్పు అంటుకుంది. గందరగోళం, పరుగులు, కేకలు. అందరూ తప్పించుకుపోయారు. నేను ఒక్కడినీ అగ్నికి ఆహుతి అవుతున్న భవనంలో బందీని అయిపోయాను. ఏ తలుపు తెరచినా రాదు. వేడికి అనుకుంటాను—అన్ని తలుపులూ బిగుసుకుపోయాయి. నా ఆర్తనాదం ఎవరి చెవినా పడలేదు. చెమటలు పోసేస్తున్నాయి. ఈలోగా ఎర్రటి కార్లలో అగ్నిమాపకదళాలు, గణ గణ గంట వాయించుకుంటూ వస్తూన్న శబ్దం వినిపించింది. రానురాను గంటల శబ్దానికి చెవులు గింగురు లెత్తిపోతున్నాయి. మంచం పక్కనున్న అలారం గడియారం మోతలో ఈ గంటల ధ్వని కలిసిపోయింది. మెలుకువ వచ్చేసింది.'

'నమ్మబుల్‌గానే వుందని నేను అంటే మీరు నమ్ముతారా?'

'వెటకారం చెయ్యకు రాధా! గమనించవలసిన విషయం ఏమిటో తెలిసిందా? కనీసం పది నిముషాలపాటైనా ఈకలంతా కని వుంటాను. అప్పుడు కదా అగ్నిదళాలవారు రావడం, గంటలు వాయించడం జరిగింది. అదే వేళకి శకీమని అలారం కొట్టిందంటే ఆశ్చర్యంగా లేదూ? అసలు అలారం ఎప్పుడు కొడుతుందో కలకి ముందస్తుగా తెలీదు కదా! గడియారం చప్పుడు చేసిన క్షణం వరకు గాఢ నిద్రలోనే వుంటాము. నిజమయిన గాఢనిద్రలో అసలు కలలు రావు. అలారం కొట్టిన వుత్తర క్షణంలో గాఢ నిద్ర కాస్త భంగమయి మామూలు నిద్రగా మారుతుంది. ఈ మామూలు నిద్రలోనే మనం కలలు కంటాం. మరొక లిప్తమాత్రపుకాలంలో మెలుకువ వచ్చేస్తుంది. కనుక మన గడియారం గంటలు కొట్టడం మొదలుపెట్టిన తర్వాత, మెలుకువ రావడానికి ముందు వున్న అత్యల్ప కాలంలో నేను మెడ్రాసు వెళ్ళినట్టు, హొటేలుకి నిప్పు అంటుకున్నట్టు ఒక కథ అల్లి, అలారం చప్పుడుకి మన మెదడు ఒక అర్థాన్ని కల్పించిందన్న మాట.' మిడతంభొట్లుగారు వూపిరి పీల్చుకున్నారు.

'అలాగే గాలిలో ఎగరడం కూడ ఒక కలే అంటారు! నేను మంత్రాల వారి మేడ కాదు కదా కనీసం మన మేరుకైనా వెళ్ళలేదేమి?' రాధ నిలదీసి అడిగింది.

రాధ అమాయకత్వానికి మిడతంభొట్లు కొద్దిగా నొచ్చుకున్నారు. రాధ అడిగిన ప్రశ్న 'చొప్పదంటు' ప్రశ్న అని తీసి పారవేయలేము. సమాధానం చెప్పడం అంత తేలికయిన పని కాదు. సుషుప్త — జాగ్రదావస్థల సరిహద్దులో సంభవించే అనుభవాలని వైజ్ఞానికంగా సమర్థించడం అంత తేలిక ఏమీ కాదు— కాని ఈ వుపోద్ఘాతం లేకుండా తనకి ఈ మధ్య జరిగిన అనుభవాలని చెబితే రాధ గాభరా పడవచ్చు. తక్షణం కర్తవ్యం ఏమిటా అని ఆలోచిస్తూనే మిడతంభొట్లు పక్కమీద నడ్డి వాల్చేరు.

* * *

దంతధావనం చేసికొని, కాఫీ కుంపటి దగ్గర ముక్కాలిపీటమీద కూర్చొని కాఫీ తాగుతూ 'అద్గది. వాతప్లవనం — దీనినే ఇంగ్లీషులో 'లెవిటేషన్' అంటారు. మానవుడు నీళ్ళలో శవాసనం వేసి తేలడం లేదూ! అలాగే ఈ భూమి చుట్టూ వున్న వాతావరణం ఒక గాలి సముద్రం. ఈ వాయు సాగరం అడుగున వున్నాం మనం. నీళ్ళలో ఆసనం వేసి తేలగలిగినట్లే ఈ వాయు సముద్రంలో కూడా కూడా తేలగలగాలి. అది భౌతిక ధర్మం. కాని యిటువంటి క్రియ నిజంగా సాధ్యమేనా? శంకరాచార్యుల వారు యిలాటి పనులు సాధించేరని పురాణాలు ఘోషిస్తున్నాయి.'

రాధ ముఖంలో కవళికలు నశించాయి. గంభీర వదనంతో ప్రశాంతంగా వుండిపోయింది.

'రాధా! ఈ రాత్రి నేను నిద్ర నుండి లేచేసరికల్లా గభీమని మిద్దెమీద నుండి కింద నున్న మంచంమీదకి పడ్డట్లు అనిపించింది. రాత్రల్లా వాయు యానం చేస్తున్నట్లే అనిపించింది. కలో! నిజమో! లేక కలే నిజమయిందో! అంతా సినిమాలా వుందనుకో! ప్రతి క్షణం వర్ణించి చెప్పగలను. చల్లటిగాలి వీస్తున్నది. ఆకాశంనిండా శ్రావణ మేఘాలు అలుముకుని వున్నాయి. నేనేమో గాలి కెరటాలలో తేలిపోతూ, మేఘాలలో నారదులవారిలా ప్రయాణం చేస్తున్నాను. చలిగాలికి తెలివి వచ్చేసింది. చుట్టూ చూద్దును గదా, నా కళ్ళని నేనే నమ్మలేకపోయాను. మంచంకోళ్ళు, రాత్రికి రాత్రే, పద్నాలుగేళ్ళ కుర్రాడు ఎదిగినట్టు ఎదిగిపోయాయో ఏమో, ఇంటి

తప్పుకున్న వాసాలు చేతికి అందేయి: పీపుకీ పరుపుకీ మధ్య పదడుగులకి పైగా అంతా ఖాళీ. పచ్చి ఖాళీ!! ఒత్తిగిల్లి చూశాను. ఒక్క కండరం శ్రమించకుండా, ఇచ్ఛా మాత్రంగా ఒత్తిగిల్ల గలిగేను. కిందికి చూద్దును కదా, చంబాడు నిశ్చింతగా నిద్రపోతునాడు. ఒక్కసారి వళ్లు ఝల్లుమంది. అంతే ! గభీమని, మామూలా పదడుగుల ఎత్తునుండీ పరుపు మీదకి పడ్డాను.'

'బాగుంది! బాం!!...మీ ఆటలు నా దగ్గర కాదు. నేనేదో వెర్రి మాలోకంలా కళ్లప్పగించి చూస్తున్నాను. ఇహ వేళా కోళాలు కట్టిపెట్టండి. మీరు కథల పోటీకి కథ వ్రాస్తునారు. మీ వూహ లన్నీ నా మీద ప్రయోగిస్తునారు' ఆసన్న మవుతూవున్న ఆపదని ఎదుర్కోడానికి సొమ్ముతలేని అసహాయస్థితిలో వున్న మానవుడి నైజమే రాధ సమాధానంలో మూర్తీభవించింది.

'రాధా! ఇదేమీ కాకమ్మ కథ కాదు.'

'కాకపోతే ఏమిటండీ ? నేనూ కలలు కన్నాను. ఆ మాటకొస్తే ఒకసారి కల గంటున్నట్టు కలగన్నాను! కలలో వుప కల!! ఎంత గాభరాగా వుంటుందో మీరే ఆలోచించండి.'

'జరిగింది మాత్రం నిజం, నమ్మ, నమ్మకపో!'

# గాలి దోషం

'మిడతంభుట్లుగారూ, మీరు భౌతిక శాస్త్రంలో ప్రావీణ్యత గడించేరు మనం భూమి మీద వున్నాం గదా ? భూమికి ఆకర్షణ శక్తి వుందని నేను మీకు చెప్పాలా? నేను గాలిలో తేలిపోతూన్నానంటే మీరు నమ్ముతారా ?'

'లేదు, లేదు. ఇప్పుడొచ్చిన చిక్కంతా అక్కడే! నాకూ నమ్మాలని లేదు మరొక సందర్భంలో అయితే నమ్మేవాడిని కానేమో! కాని నమ్మవలసిన అవసరం వచ్చింది. నా అనుభవానికి వైజ్ఞానికమయిన వివరీ కరణ వుంటుందేమోనని గ్రంథాలయానికి వెళ్లేను. పై అరలో వున్న పుస్తకాలు అందకపోతే కొద్దిగా గెంతేను అంతే! అమాంతం మాయాబజారులో ఘటోత్కచుడిలా పైకి తేలిపోయాను. అప్పుడు ఏవో పైత్యం చేసిందనుకున్నాను. కాని రాత్రి జరిగిన సంఘటన తర్వాత అంతా నిజమే నేమో...'.

'అమ్మా! యీ రోజు సప్తమీ బుధ వారం, మృగశిర ఘడియలు నాలుగు గంటల వరకూ — రాహుకాలం సూర్యా స్తమయం వరకు వుంది. రాధమ్మా! ఏమిటి చిన్నబాబుకి అస్వస్థతగా వుందని కబురు పెట్టావు.' అంటూ అవధానిగారు రానే వచ్చారు. వస్తూనే వంటగదిలో వెళ్లి పీట తెచ్చుకొని విఘ్నేశ్వర జపం మొదలు పెట్టేరు.

'మీ అందరికీ మతిపోయి వుండాలి! ఇంత బతుకూ బతికి ఇంటెనక్కాల చచ్చి నట్టు, ఫిజిక్సు ప్రొఫెసర్ననిపించుకొని భూతాలు, చెరుపు, చిల్లంగి... అంటే నమ్ముతానా?'

మిడతంభుట్లు గొడవ ఎవరూ విని పించుకోలేదు.

'...గోవిందా, మధుసూధనా, త్రివి క్రమా...అమ్మాయీ! మన చిరంజీవి జాతకం పట్టమ్మా! శ్రీధరా, హృషీకేశా ...వోం! భూం!...దుర్...' అని అవధాని గారు మంత్రాలు, ఆజ్ఞలు ఒకే గుక్కలో వల్లిస్తూ ఒక్క గాట్టి పొడుం పట్టు లాగించేరు.

'దీన్నే అష్టావధానం అంటారుట.' అని మిడతంభుట్లు ఎగతాళి చెయ్య బోవడం, రాధ రుస రుస లాడడం లిప్త మాత్రంలో జరిగిపోయాయి.

'లగ్నంలో వున్న పంచమాధిపతి గురుడు, శని స్థానంలో వున్న సూర్యుడిని వక్ర దృష్టితో చూస్తునాడమ్మా ! ఇది జాతకుని మనో చలనానికి...'

రాధమ్మని చప్పుడైన తలుపు మిడతం భుట్లు రంగంనుండి నిష్క్రమించేడని సూచించింది.

*

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అంత ర్జాతీయ భౌతికశాస్త్ర సమ్మేళనం జరుగు తుందన్న వార్త వినగానే మిడతంభుట్లు మనస్సు ఎగిరి గంతేసింది. ఈ అవకా శాన్ని సద్వినియోగం చేసికొందామని ఎంతో ఆరాటంతో సమ్మేళనం కార్యదర్శి ప్రకాశంగారిని దర్శనం చేసికొన్నాడు మిడతంభుట్లు కథంతా ప్రశాంతంగా విన్న ప్రకాశంగారు—

'మేష్టారూ! సమావేశం ఆఖరురోజున అతిథులందరి గౌరవార్థం 'ఎంటర్ టెయిన్‌మెంట్' వుంటుంది. 'రిహార్సల్స్' వ్యవహారాలన్నీ చిదంబరంగారు చూస్తు నారు. నేను చెప్పేనని చెప్పండి, తప్ప కుండా మీకు ఛాన్సు యిస్తారు'.

మిడతంభుట్లు అహం బాగా దెబ్బ తింది. కాని ఆయన కార్యశూరుడు అలాగేనని ఒప్పుకున్నాడు.

* *



దూరాన్న వున్న నీలిరంగు సముద్రపు హోరు నేపథ్య సంగీతం అందజేస్తూ వుంటే, వివిధ దేశాలనుండి వచ్చిన పండితులు మూడురోజులపాటు భౌతిక శాస్త్రంలో కుస్తీలుపట్టి అలసిపోయారు చల్లని సముద్రపుగాలికి వేస్తూవున్న చిరుచలిని లక్ష్యపెట్టకుండా రష్యానుండి వచ్చిన పండిట్ పిసరెంకోగారు, జర్మనీ నుండి వెళ్లి అమెరికాలో స్థిరపడిపోయిన అమెరికన్ పండిట్ ఎబర్‌హార్ట్‌గారు ఐన్‌స్టైన్ సిద్ధాంతం మీద లోబిఛేవ్‌స్కీ క్షేత్రగణితం ప్రభావం ఏమిటా అని తీవ్రంగా చర్చించేస్తున్నారు. విదేశాలనుండి వచ్చిన అతిథుల సత్కారం కొరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు ఆ మూడు రోజుల పాటు ఆంధ్రవిశ్వవిద్యాలయం పరిహద్దులలో మద్యనిషేధం చట్టాన్ని రద్దుచేశారేమో, దాని మజా కూడ సభికుల వుత్సాహానికి కొంతవరకు కారణమయింది.

'ఎక్స్‌క్యూజుమి! ప్రొఫెసర్ ఎబర్‌హార్ట్!, జ్‌ద్రాస్త్‌వితి! ఎకడమీషియన్ పిసరెంకో!' పొల్లుపోని ఇంగ్లీషు, రష్యన్ భాషలలో ఇద్దరినీ పలకరించి, అతిథుల సంభాషణలో ఉత్సాహం చూపించేరు మిడతంభొట్లుగారు. తెల్లవాడు మెచ్చుకొంటే కాని సాటి నల్లవాడి మెప్పు పొందడం దుర్లభమని మిడతంభొట్లు గారు ఎప్పుడో అనుభవంవల్ల తెలిసి కొన్నారు. 'ఎంటర్ టెయిన్‌మెంట్ ప్రోగ్రామ్' మొదలవకుండానే తన గోడు మరొకడి చెవిన పడేయాలన్న వుత్కంఠతో వున్న మేష్టారికీ యీ సదవకాశం విడుచుకోవడంలో ఏమంత విజ్ఞత కనిపించలేదు.

మిడతంభొట్లుగారు గుక్క తిప్పుకోకుండా చెప్పినదంతా వూపిరి బిగపట్టుకుని విన్నారు. రెండు నిమిషాలపాటు బరువైన నిశ్శబ్దం వాతావరణంలోకి దిగింది.

'మీ అనుభవం వింటూవుంటే వెతకబోయిన తీర్థం ఎదురైనట్లు అయిందండీ' అన్నారు రష్యన్‌భాషలో సామెతలు చెప్పడంలో ఆరితేరిన పిసరెంకోగారు.

'మీ అనుభవాన్ని మేముకూడా పంచుకోడానికి వీలవుతుందా? ప్రొఫెసర్‌గారూ' అని అమెరికన్ కూడా ప్రోత్సహించడంతో మిడతంభొట్లు నిజంగా ఎగిరి గంతేసేరు.

'... రకం ఎగరడం మీ అనుభవం అని చెప్పకండి' అని పిసరెంకోగారు చమత్కరించారు. అంతా గొల్లుమని నవ్వడంతో బరువెక్కిన వాతావరణం కొంత తేలికయింది.

మిడతంభొట్లుగారు గుప్తంగా పేంటు జేబులలో దాచిన సీశరాళ్లని బయట పడేశారు. రెండడుగులు వెనక్కివేసి కొమ్మ చివరనున్న మామిడికాయని అందుకోడానికా అన్నట్లు కాళ్లు సాగదీసి ఎగరబోయేరు అమాంతం గాలిలోకి లేచిపోయిన మిడతంభొట్లుని చూసేసరికి తమ కళ్లని తామే నమ్మలేక పోయారు ప్రేక్షకులిద్దరూ. గాలిలోకి తేలిపోవడమేకాదు, చిటారుకొమ్మ చివర దరిదాపు రెండు మూడు నిమిషాలు శ్రమించకుం- 'నిలబడ' గలిగేరు మిడతంభొట్లు మేష్టారు

ఇటువంటి విశేషమయిన విశేషానికి తార్కికమయిన కారణం ఏమిటా అని చాల పెద్దఎత్తున చర్చ జరిగింది చెట్టు కింద చేరిన త్రిమూర్తుల మధ్య. భూమికి ఆకర్షణశక్తి నశించింది అన్నారు ఒకరు. ఆ లెక్కని అందరూ తేలిపోవాలే! ఆ మాటకొస్తే ఆకర్షణశక్తి నశించిన భూగోళం తన గతి తప్పకుండా సూర్యుడి చుట్టూ తిరగలేదే! ఇలాగే ఎన్నోపిల్ల సిద్ధాంతాలు, పిచిక సిద్ధాంతాలు తిరగేసి చూశారు. ఈ జటిలమయిన ప్రశ్నకి సమాధానం వెదకడానికి ఒకపద్ధతిని అవలంబించడానికి అంగీకరించేరు

'ఒక్క మిడతంభొట్లు మేష్టారికే యిటువంటి అనుభవం కలుగుతున్నది గనుక ఆయన భౌతికకాయంలో శారీరకమయిన దోషం ఏదైనా వుండివుండాలి లేదా ఆయన తక్షణ పరిసరాల్లో వున్న గాలిలోనైనా ఏదో దోషం వుండివుండాలి. ఉదాహరణకి ఆ వ్యక్తి చుట్టూవున్న గాలి అకస్మాత్తుగా చిక్కబడిందనుకుందాం.' అప్పుడు ఆ అధిక సాంద్రత పొందిన గాలిలో ఆయన తేలిపోడానికి, అదికూడా ఆ వ్యక్తి యిచ్ఛాయిచ్ఛాలతో నిమిత్తం లేకుండా. సావకాశం వుంటుంది గదా!' అని పిసరెంకోగారు ఒక సిద్ధాంతాన్ని ప్రతిపాదించేరు.

'అటువంటప్పుడు మిడతంభొట్లుగారి తక్షణ పరిసరాల్లో వున్న వస్తువులు కూడా యిటువంటి అనుభవాన్నే పొందాలి కదా?' ఎబర్‌హార్ట్‌గారు సందేహాన్ని వెలిబుచ్చేరు.


'థర్మోడైనమిక్స్' రెండవ సూత్రం మీద నేను ఆశ ఎక్కువ పెట్టుకున్నాను ఎంతవరకూ నిజమో మరి!' అని మిడతంభొట్లుగారు బితుకు బితుకు మంటూ గొణిగారు.

అతిథులు యిద్దరూ ప్రోత్సహించగా మిడతంభొట్లుగారు తనకి తోచిన సిద్ధాంతం



పండిత్ డి. గోపాలాచార్యులవారి
**అరుణా**
స్త్రీల
ఆరోగ్య సౌభాగ్యానికి
1898 నుండి ప్రసిద్ధిగాంచినది
**ఆయుర్వేదాశ్రమం**
(ప్రైవేట్) లిమిటెడ్
100, జీ. ఎస్. రోడ్, మదరాసు-17.

**తెల్ల వెంట్రుకలుండవు**
పొగడడం మాకు ఇష్టంలేదు. కాని మా "కేశ్ రంజన్" ఆయుర్వేదిక్ పెంటెడ్ ఆయిల్ తెల్ల వెంట్రుకలను నల్లగా మార్చును. మొదట తెల్ల వెంట్రుకలు నల్లవిగామార్చి, ఆటుపైన నల్లని వెంట్రుకలే వచ్చును. ఈ ఆయిల్ జ్ఞాపకశక్తి, కంటిచూపువృద్ధిపరచును. లాభంపొందినవారు 1000 పైగా మాకు వ్రాసియున్నారు. లాభం లేకున్న డబ్బు వాపసు. ధర రు. 10/-
Western India Co., (S N.)
P. O. Katri Sarai (Gaya)



**లిచెన్సా**
వాడండి
DZ 1613 ATG

# గాలి దోషం

త్వాన్ని ప్రతిపాదించసాగేరు.

'నిశ్చలంగ వున్న నీటితోనిండిన ఒక గాజు బుడ్డిలో ఒక సిరా చుక్క వేస్తే ఏమిటవుతుంది ? కాలచక్రం తిరుగుతూ వున్నకొద్దీ సిరా నీటిలో నెమ్మదిగా కలిసిపోతుంది. వేసినచోట వుండకుండా క్రమం తప్పి చెదిరిపోతుంది. ప్రయత్నం చెయ్యకుండా, శక్తిని వ్యయించకుండా ఆ సిరా చుక్కని నీటిలోనుండి మళ్ళా తియ్యలేము. గాజు బుడ్డిలో సిరాయే కాదు, ఈ ప్రపంచంలో ఏదయినా సరే కట్టడి, ఒత్తిడి లేకుండా ఒదిలివేస్తే క్రమత్వం నశించి అక్రమత్వం ప్రజ్వలిస్తుంది. ఉపాధ్యాయుడు అనే బాహ్యమయిన ఒత్తిడిని తీసివేస్తే విద్యార్థులు క్రమ శిక్షణ లేకుండా అల్లరి చెయ్యరూ? యుగాలు గడుస్తూ వున్నకొద్దీ ప్రపంచంలో ధర్మం నశించి అధర్మం ప్రబలటం లేదూ? ఇది ప్రకృతి సిద్ధం. దూరాన్ని కొలవడానికి గజాలు, అడుగులు వాడినట్టే, కాలాన్ని కొలవడానికి గంటలు వాడినట్టే ఈ అక్రమత్వాన్ని కొలవడానికి 'యంతరపి' (ఎంట్రోపీ) అనేమాట వాడతారు. కాలం గడుస్తూ వున్నకొద్దీ అక్రమత్వం పెరుగుతుందన్న విషయాన్ని భౌతిక శాస్త్రవేత్తలు యంతరపి పెరుగుతున్నదని అంటారు.'

అప్పటికే కుతూహలంతో మూగిన ప్రజలలో ఒకడు ఉత్కంఠ భరించలేక మేష్టారిని తొందర పెట్టసాగేడు.

'నిర్జీవ మయిన భౌతిక ప్రపంచంలో యంతరపి పెరగడమనేది ప్రకృతి ధర్మం. యంతరపి తగ్గిందంటే కాలచక్రం వెనక్కి తిరిగినట్టే. ఇది అసంభవ మని మనందరికీ తెలుసు. కాని, చూశారూ, సజీవులలో ఇది సాధ్యం. గజిబిజిగా వున్న అక్రమత్వం నుండి క్రమత్వం సంభవిస్తుంది. మన జన్మ కాండే దీనికి ఉదాహరణ. తల్లి గర్భంలో పడ్డ దగ్గర నుండీ, తల్లి రక్త మాంసాలు తీసికొని తీసికొని ఒక క్రమమయిన పద్ధతిలో పిండం వృద్ధి పొందుతుంది. ఆకారంలేని రక్తమాంసాలు కల్లిదండ్రుల ఆకారంలోకి మారుతున్నాయి కదా? కాలచక్రాన్ని వెనక్కి తిప్పవలసిన అవసరంలేకుండా యిక్కడ యంతరపి తగ్గడం జరిగింది. ఇది 'థెర్మోడైనమిక్స్ రెండవ సూత్రానికి విరుద్ధం'

ఎబర్ హార్ట్ గారికి ఇదేమీ అర్థం కాలేదు. 'మేష్టారూ, మీరు చెప్పేదానికీ, మీ అనుభవానికీ సంబంధం ఏమిటండీ' అని అడిగారు.

'వస్తున్నా! ఈ రెండవ సూత్రం నమ్మ అయినట్లు కనిపించడం యిటువంటి సూక్ష్మమయిన స్థాయిలోనే. భారీఎత్తున రెండవ సూత్రం అక్షరాలా వర్తిస్తుంది. సజీవ కాయంలో క్రమత్వం ఎక్కువ గనుక నున్నా, బాహ్య ప్రపంచంలో క్రమత్వం తగ్గాలి కనుక నున్నా సజీవమయిన కాయానికీ, నిర్జీవమయిన వాతావరణానికి మధ్యనున్న అంచువద్ద విచిత్రమయిన సంఘటనలు జరగవచ్చు. ఉదాహరణకు నా శరీరంలో వున్న పదార్థం ఏష్యం అయిపోయిందనుకుందాము; అంటే ఎముకలు గుల్లబారిపోయి వుండవచ్చు. పదార్థాన్ని నిర్మూలం చెయ్యలేము గనుక ఏష్యం అయిన శారీరక పదార్థం బాహ్య వాతా—వరణంలోకి పోవాలి. అంటే శరీరం చుట్టూ వున్న వాతావరణంలోని గాలిలోకి అధికమయిన పదార్థం చేరిందన్నమాట. అప్పుడు గాలిసాంద్రత పెరిగిందన్నమాటే గదా! జీలుగుబెండు నీటిలో తేలినట్టే, అప్పుడు గరిష్టమయిన సాంద్రత పొందిన గాలిలో నా శరీరంకూడా తేలిపోయి వుంటుంది.'

'మీరు చెప్పిన సిద్ధాంతమే సరి అయితే ఒక్క ఎముకలే ఎందుకు గుల్లబారాలి? రక్తమాంసాలు కూడా ఏష్యం అయిపోవడానికి అవకాశం వుందే! అదెందుకు జరగలేదు?' పిసరెంకోగారు ధర్మసందేహం వెలిబుచ్చేరు.

'కావచ్చు నా శరీరంలో ఎందువల్లనో అర్ధాంతరంగా ఈ ప్రక్రియ జరిగి మళ్ళీ తిరుగుముఖం పడుతున్నది. పరిస్థితులు సరి అయినవయితే, శరీరం అంతా ఏష్యం అయిపోడానికి ఆస్కారం లేకపోలేదు.' మిడకంభట్లు గారు సమాధానం చెప్పేరు.

'ఇటువంటిది చరిత్రలో యింతకు ముందెప్పుడయినా ఈ ప్రపంచంలో జరగ

[illegible] కల్పితం కష్టం' అమెరికన్ ప్రొఫెసర్ పెదవి విరిచేసేరు.

'లేకేమి! శంకరాచార్యులవారు యిటు వంటి విచిత్రాలెన్నో చేసి చూపించేరని మా పురాణాలు ఘోషిస్తున్నాయి. గాలిలో తేలడం, ఒకచోట అదృశ్యం అయి మరొక చోట ప్రత్యక్షమవడం, పరకాయ ప్రవేశం యిలాంటి వెన్నో!'

'ఇది ఇప్పటితో తేలే విషయం కాదు అప్పుడే వేళకూడా నిశిరాత్రి దాటింది రేపు ఈ విషయం కూలంకషంగా చర్చిద్దాం' అని అంతా ఆ రాత్రికి విరమించేరు.

* * *

సిలోన్ రేడియోలో లలిత సంగీతం నేపథ్యగానాన్ని సమకూరుస్తూ వుంటే 'ఏమండీ! ఏమండీ! ఇంకా లేవరేం? మధ్యాహ్నం కావస్తూ వుంటేను' అన్న రాధ కంఠస్వరం మేలుకొలుపులా వినిపించింది. చింత నిప్పుల్లాంటి కళ్లతో బద్ధకంగా ఒళ్లు విరిచేరు మిడతంభొట్లు మేష్టారు.

'ఏమిటోనండీ! యంత్రం, యంత్రం అని ఒకటే కలవరింతలు. భయం వేసి అవధానిగారిని పిలిపించేను'

'ఏమీ లేదయ్యా! ఆంజనేయస్వామి కోవిలలో రాత్రిల్లు ఈ యంత్రంమీద జపం చేశాను. ఇది మెళ్లో వేసికున్నా వంటే అన్నీ సర్దుకుంటాయి. అంతా ఆ వాయుపుత్రుని మహిమ! నేను జపం చేస్తూ వుండగానే అశరీర రూపంలో నా దగ్గరకువచ్చి నాచేత 'యంత్రం' అనే మాట పలికించేడు. రాధమ్మా ప్రమాదం గడిచిపోయింది. మరి నే వెళ్లి వస్తాను'

రాధ, అవధాని చేస్తున్న కుట్రనుండి బయట పడడానికి మార్గాంతరం లేక వూపిరి బరువుగ పీల్చి, బరువైన తన శారీరక కాయాన్ని గ్రంథాలయానికి చేరవేశారు మిడతంభొట్లు మేష్టారు ●


# దగ్గా?
# వెక్స్

దగ్గు, గొంతుకనొప్పికి
అద్భుతంగ పనిచేయు నివారిణి

ఒక వెక్స్ బిళ్లను నోటిలో కరగనీయండి. అప్పుడు క్షేమమైన, ఉపశమనకారులైన ఓషధుల సారములు వెంటనే పనిచేయనారంభిస్తాయి. ఈ సారములు మీ శ్వాసతో కలిసిపోయి, మీ గొంతుకను, ఊపిరి తిత్తులను ఉపశమనపరుస్తాయి. మీకు దగ్గు వచ్చినప్పుడు, గొంతుక నొప్పి పెట్టినప్పుడు, రేక జలుబు చేసినప్పుడు అవి ఎంతో సమర్థంగ పనిచేస్తాయి; సుఖకరంగా ఉంటాయి.




వెక్స్ 50 ఏళ్లకు పైగా నమ్మబడిన దగ్గు నివారిణి

ASP/P-F



# ఇంప్‌కాప్స్‌లో సమస్తమూ యంత్రాలచే నిర్వహించబడుతున్నది

కాగా ఇంప్‌కాప్స్ నికార్సయిన అయుర్వేద, సిద్ధ, యునానీ మందులకు పెట్టినది పేరు

దేశీయ వైద్యులు కొందరు చేరి 1944వ సంవత్సరంలోనే సహకార పద్ధతులపైన ఒక ఫార్మశీని స్థాపించారు. నికార్సయిన ఆయుర్వేద, సిద్ధ, యునానీ మందులను తయారుచేయడం, దేశీయ ఓషధులలో పరిశోధనలు సాగించడం, ప్రాచీన భిషగ్వరుల సూత్రాలను ప్రామాణికం చేయడం ఈ సంస్థ లక్ష్యాలు. భవిష్యత్తుపైన పరిపూర్ణ విశ్వాసంతో పురోగమించి, ఇప్పుడు పూర్తిగా అధునాతన పద్ధతులపై యంత్రాలతోనే మందులను తయారు చేయడం సాధించి, ప్రజలకు సేవ చేయడానికి అర్హత సంపాదించుకున్నాము ప్రజలను ఆరోగ్యవంతులను గాను, శక్తిమంతులనుగాను చేసి, దేశాన్ని సౌష్ఠవం చేయడానికి ఇంప్‌కాప్స్ సహాయపడుతున్నది.



IMPCOPS

ది ఇండియన్ మెడికల్ ప్రాక్టీషనర్స్ కో-ఆపరేటివ్ ఫార్మశీ & స్టోర్స్ లిమి.,
లాటిస్ బ్రిడ్జ్ రోడ్, అడయార్, మద్రాసు-20
పెద్ద కెమిస్టులవద్ద, పెద్ద మందుల దుకాణాలలోను లభ్యం కాగలవు

ఇతర ఆఫీసులు: తాడేపల్లి పోష్టు, గుంటూరు జిల్లా, ఆంధ్ర ప్రదేశ్
20/320-ఎ. పెదిభొట్లవారి వీధి, గవర్నరుపేట, విజయవాడ-2
19 వైశ్య హాస్టల్ బిల్డింగ్స్, వీర సావర్కర్ రోడ్డు, హైదరాబాదు-27

IMP/7/M.TEL